## క్లుప్తంగా

### డాక్టరేట్ గ్రహీతకు అభినందనలు

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఏ నరసింహరెడ్డికి ఆళ్వార్ సన్‌రైజ్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. భౌతికశాస్త్రంలో 'బయోమెడికల్ అప్లికేషన్ ఆఫ్ ఫైబర్ ఆప్టిక్స్ సెన్సార్స్ ఇన్ ఇమేజింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్' అనే అంశంపై పరిశోధనలు సాగించినందుకు గానూ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌కు అధ్యాపకులు, ఉద్యోగులు గురువారం అభినందనలు తెలిపారు.

### వరద బాధితులకు అపస్మా చేయూత



ఆత్మకూరు: విజయవాడ వరద బాధితులకు అపస్మా గురువారం చేయూతనందించింది. ఆత్మకూరు నియోజకవర్గ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిసి 300 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రమణారెడ్డి, అపస్మా జిల్లా కార్యదర్శులు రామ్మోహన్‌రెడ్డి, ప్రభాకర్, ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు టీసీ వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శుల బదిలీ

సీతారామపురం: మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు గురువారం బదిలీ అయ్యారు. బసినేనిపల్లిలో పనిచేస్తున్న వై రాజేష్ చేజర్ల, బాలాయపల్లిలో పనిచేస్తున్న మాల్యాద్రి వరికుంటపాడు మండలం మహ్మదాపురం, సీతారామపురం బిట్–2లో పనిచేస్తున్న జీవన్ దేవమ్మచెరువుకు బదిలీ అయ్యారు. పాదలకూరు బిట్–2లో పనిచేస్తున్న షఫి సీతారామపురం బిట్–2, డక్కిలి మండలం పాతనాలపాడులో పనిచేస్తున్న హరి బాలాయపల్లి పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ కరటంపాడు జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు.

### మున్సిపల్ అధికారుల బదిలీ

కావలి: కావలి మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు గురువారం బదిలీ అయ్యారు. మున్సిపల్ డీఈ సాయిరాం, ఏఈ షైనీ నెల్లూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. మరో ఏఈ శ్రీనివాసులురెడ్డి ఆత్మకూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. మున్సిపల్ నూతన డీఈగా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే అల్లూరు నగర పంచాయతీలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న వినోద్ బదిలీపై కావలి మున్సిపాలిటీలో ఏఈగా నియమితులయ్యారు. కావలి మున్సిపాలిటీలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. కావలి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) బాబురావు ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా వివేకానంద బాధ్యతలు చేపట్టారు.

### జాతీయ కరాటే పోటీలకు ఆత్మకూరు విద్యార్థి



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎస్ విఘ్నేష్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. వైఎస్సార్ జిల్లా రాజంపేటలో బుధవారం జరిగిన అండర్–19 స్కూల్‌గేమ్స్ కరాటే పోటీల్లో విఘ్నేష్ సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కరాటే మాస్టర్ వాసు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ స్టేడియంలో డిసెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విఘ్నేష్‌ను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

### ఉక్కపోతతో అంగన్‌వాడీ చిన్నారుల విలవిల

ఆత్మకూరురూరల్: వాశిలి ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రం విద్యుత్ కనెక్షన్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది గురువారం తొలగించారు. దీంతో ఉక్కపోతతో చిన్నారులు విలవిలలాడారు. విద్యుత్ సర్వీసు వైరు, మీటరును సమకూర్చుకోవాలని అంగన్‌వాడీకి ఎన్నిసార్లు చెప్పినా వినలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో కనెక్షన్‌ను తొలగించామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సామగ్రిని సమకూర్చాలని పంచాయతీని కోరితే స్పందించలేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేశవ నారాయణమ్మ తెలిపారు. ఈ విషయమై సర్పంచ్ చెలిక రమాహరిబాబును వివరణ కోరగా పంచాయతీ తరుఫున సమకూర్చే వెసులుబాటులేదని ఉన్నతాధికారులు చెప్పడంతో చర్యలు తీసుకోలేకపోయామని తెలిపారు.

### మొక్కుబడిగా గ్రామసభలు

చేజర్ల: మండలంలోని 26 పంచాయతీల్లో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపునకు చేపడుతున్న గ్రామసభలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆదూరుపల్లిలో జరిగిన గ్రామసభకు ఉపసర్పంచ్ హాజరైనప్పటికీ టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో కార్యదర్శి పనులపై చర్చించి తీర్మానించడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.

# పింఛన్లకు కత్తెర



- కూటమి ప్రభుత్వం మార్కు కుట్ర
- సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ప్రతినెలా కోత
- రెండు నెలల్లో 200కుపైగా పింఛన్ల తొలగింపు
- ఆందోళనలో లబ్ధిదారులు

ఆత్మకూరు: తాము అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.4వేలు చేస్తాం..అర్హత ఉన్న వారందరికీ అందజేస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక తన మార్కును చూపుతోంది. పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు కోతలకు సిద్ధమైంది. ఒక్కసారిగా పింఛన్లను తొలగిస్తే ఎక్కడ అపప్రద మూటకట్టుకోవాల్సి వస్తోందని, సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ప్రతి నెలా పింఛన్లను తొలగిస్తూ వస్తోంది. సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెట్టి ఒక్కరోజులోనే పింఛ్లను పంపిణీ చేయిస్తూ తొలగించిన లబ్ధిదారుల వివరాలు వెలుగులోకి రాకుండా జాగ్రత్తలు పడుతోంది.

**ఆత్మకూరు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ**

| మండలం | ఆగస్టు | అక్టోబరు |
|---|---|---|
| అనంతసాగరం | 6,208 | 6,176 |
| ఏఎస్‌పేట | 5,009 | 4,976 |
| ఆత్మకూరు | 4,948 | 4,907 |
| ఆత్మకూరు టౌన్ | 3,440 | 3,422 |
| చేజర్ల | 5,275 | 5,237 |
| మర్రిపాడు | 6,250 | 6,218 |
| సంగం | 6,732 | 6,695 |
| మొత్తం | 37,862 | 37,631 |

**రెండు నెలల వ్యవధిలో..**

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆగస్టులో 37,862 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, అక్టోబరులో 37,631 మంది లబ్ధిదారులు ఉన్నట్లుగా రికార్డుల్లో నమోదైంది. అంటే రెండు నెలల వ్యవధిలో 231 పింఛన్లకు కొత్త ప్రభుత్వం మంగళం పాడినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది. ఆదాయం అధికంగా ఉందని, విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందని, దివ్యాంగుల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్, తదితర కారణాలను సాకుగా చూపుతూ పింఛన్లను నిలిపివేస్తున్నట్లుగా బాధితులు చెబుతున్నారు. అధికారుల వద్దకు వెళ్లి సమాచారం తెలుసుకుని వివరణ ఇచ్చేలోగా మైగ్రేషన్ పేరుతో తొలగిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వ హయాంలో ఇలా...**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లే అర్హత కలిగిన వారిని గుర్తించి సచివాలయాల ద్వారా పింఛన్లు మంజూరు చేయించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఇప్పటి వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించకపోవడంతో అన్ని అర్హతలు ఉన్న వారు ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు. కొత్త పింఛన్లను అందజేయకపోగా వివిధ కారణాలతో పాత పింఛన్లకు కోత వేస్తుండడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. వివిధ కారణాలతో తొలగించిన పింఛన్ల లబ్ధిదారులు ఎప్పుడు పునరుద్ధరించి అందజేస్తారోనని ఎదురుచూస్తున్నారు. కాగా పింఛన్ల తొలగింపు విషయమై ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించగా తాము పింఛన్లను తొలగించడంలేదని, బహుశా చనిపోయిన వారి పింఛన్లు నిలిచిపోయి ఉండొచ్చని తెలిపారు. నూతన పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు. అయితే రెండు నెలల వ్యవధిలో నియోజకవర్గ పరిధిలో ఇంత మంది లబ్ధిదారులు చనిపోయి ఉంటారా అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

## వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కావలి: పట్టణంలోని బృందావనం కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు అంకురార్పణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 4న ధ్వజరోహణ, పెద్ద శేష వాహనోత్సవం, 5న చిన్న శేష వాహనోత్సవం, స్నపన తిరుమంజనం, హంస వాహనోత్సవం, 6న సింహ వాహనోత్సవం, ముత్యపు పందిరి వాహనోత్సవం, 7న కల్పవృక్ష వాహనోత్సవం, సర్వభూపాల వాహనోత్సవం, 8న మోహినీ అలకారం, గరుడ వాహనోత్సవం, 9న హనుమంతు వాహనోత్సవం, వసంతోత్సవం, పుష్పపల్లకీసేవ, గజ వాహనోత్సవం, 10న సూర్యప్రభ వాహనోత్సవం, చంద్రప్రభ వాహనోత్సవం, 11న రథోత్సవం, అశ్వ వాహనోత్సవం, 12న చక్రస్నానం, పల్లకీసేవ నిర్వహించనున్నారు. 13న స్నపన తిరుమంజనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీవారి ఆలయం

## వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వింజమూరు(ఉదయగిరి): టూవీలర్ మెకానిక్‌లు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని జీవన స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని ఉదయగిరి సహాయ కార్మిక అధికారి వై సత్యనారాయణ, కలిగిరి ఎస్సై ఉమామహేశ్వరరావు సూచించారు. వింజమూరులోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో విక్రమ సింహపురి టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాలకు సంబంధించిన మెకానిక్‌ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని, వారిని మెకానిక్‌లో చేర్చుకోవద్దని సూచించారు. కస్టమర్లతో మర్యాదగా నడుచుకుని వారి మన్ననలు పొందాలన్నారు. దొంగతనంగా తీసుకొచ్చిన వాహనాలు కొనడం లేదా అమ్మడం చట్టవ్యతిరేకమని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండడంతో పాటు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రఫీ, ఉపాధ్యక్షుడు టీపీఎస్ బాషా, కోశాధికారి షేక్ రసూల్, ఎస్వీ మస్తాన్, ఎం సుబ్బారెడ్డి, సయ్యద్ బాబు, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టూవీలర్ మెకానిక్‌ల సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

## గ్యాస్ పైపులైన్ నిర్మాణం పేరుతో రోడ్లు ధ్వంసం

కావలి : గ్యాస్ పైప్‌లైన్‌నిర్మాణం పేరుతో కావలి తీరప్రాంత గ్రామాల్లోని రోడ్లు, తాగునీటి పైపులైన్లను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు తీరప్రాంత గ్రామాల ప్రజలతో కలిసి కావలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం మల్లి మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు నుంచి కావలి వైపు తీరంలో వందల కోట్ల రూపాయలతో గ్యాస్‌పైప్‌లైన్ వేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో తీరప్రాంత గ్రామాల్లోని రోడ్లు, తాగునీటి పైపులైన్లను ధ్వంసం చేస్తున్నారని వివరించారు. వాటిని తిరిగి పునర్నిర్మించకుండా వెళ్లిపోతున్నారని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రెవెన్యూ అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తిరిగి నిర్మించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజి పాక రత్నం, చెరుకూరి జనార్దన్, జ్యోతి, శ్రీనివాసులు, ఏడుకొండలు పాల్గొన్నారు.



తీరప్రాంత ప్రజలతో కలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్న మల్లి

### పీహెచ్‌డీ గ్రహీతలకు సన్మానం

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తూ పీహెచ్‌డీలు పొందిన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ ఎస్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు గురువారం ఘనంగా సత్కరించారు. ట్రిపుల్‌ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వాసుపల్లి రవీంద్రారెడ్డి తిరుపతి ఎస్వీ వర్సిటీ నుంచి, హెచ్‌అండ్‌ఎస్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ కే లక్ష్మి జేఎన్టీయూ అనంతపురం నుంచి, సివిల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డి ఎన్‌ఐటీ కాలికట్ నుంచి, కే జగదీష్ చెన్నై క్రిసెంట్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీలు పొందారు. వీరిని కళాశాలలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కళాశాల పరిపాలనాధికారి ఆర్వీ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వీ సునీల్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు సాయిపేటలో ప్రజాదర్బార్

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీలో ప్రజాదర్బార్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ కార్యాలయ ఏఓ శేషసాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

### నేడు ఉచిత ఇసుక కోసం సీపీఎం ర్యాలీ

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు గురువారం తెలిపారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ పనులు సాగక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఆధునిక పద్ధతులను అవలంబించాలి



సీతారామపురం: వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



మర్రిపాడు: మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆత్మకూరురూరల్/మర్రిపాడు/సీతారామపురం/చేజర్ల: రైతులు సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించి లాభాలను పొందాలని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ సూచించారు. పట్టణంలోని పంటవీధి, వెన్నవాడలోని రైతుసేవా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పంటల సాగులోని మెలకువలను తెలియజేశారు. రబీ సీజన్‌లో సేంద్రియ ఎరువులను వినియోగించి ఎరువులు, పురుగు మందుల ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు ఏఓ కిషోర్‌బాబు ప్రభుత్వ రాయితీలు, ఈ పంట నమోదు, సీసీఆర్‌సీ కార్డులు, పీఎం కిసాన్ పథకంపై అవగాహన కల్పించారు. చేజర్ల మండలం చిత్తలూరు, ఆదూరుపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఏఓ శశిధర్ పాల్గొన్నారు. మేలురకం విత్తనాల కొనుగోలు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి, చుంచులూరు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు. మిరప పంటను పరిశీలించి ఆకుముడత తెగులు ఉన్నట్లు గుర్తించి నివారణకు బులుగు, పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 20 పెట్టాలని సూచించారు. ఎకరాకు లీటర్ వేపనూనె లేదా ప్రొఫినోల్ లీటర్ నీటికి 2 మి.లీ. పిచికారీ చేయాలని తెలిపారు. కీటక శాస్త్రవేత్త సురేఖ, తదితరులు పాల్గొన్నారు. సీతారామపురం మండలం నారాయణప్పపేట, సంగసానిపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి పాల్గొన్నారు. వరిపైరును సందర్శించి యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణపై సూచనలు చేశారు.

## రాత్రికి రాత్రే ప్రభుత్వ భూముల్లో పాగా

మర్రిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణ పర్వానికి తెరలేపారు. ఏ గ్రామంలోనైనా జానెడు ప్రభుత్వ భూమి కనిపించినా రాత్రికి రాత్రే ఆక్రమించి చదును చేసి చెట్లు నాటేందుకు యత్నిస్తున్నారు. తాజాగా చిన్నమాచనూరు రెవెన్యూ పరిధిలోని కదిరినేనిపల్లిలో సర్వే నంబర్ 1, 67లో ఉన్న 40 ఎకరాల భూమిని మేత పోరంబోకు భూమిని కొందరు టీడీపీ నాయకులు ఆక్రమించారు. రాత్రికి రాత్రే చదును చేసి 20 ఎకరాల్లో జామాయిల్ మొక్కలను సైతం నాటారు. పశువుల మేత పోరంబోకు భూములను ఆక్రమించినా అధికారులు చోద్యం చూస్తుండడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల రెవెన్యూ అధికారులను వివరణ కోరగా శుక్రవారం పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మేత పోరంబోకును చదును చేసిన దృశ్యం

## రక్తదాన మోటివేటర్లకు పురస్కారాలు



సోమశిల: పురస్కారం అందుకున్న ఉప్పలపాటి జగదీష్



కావలి: రెడ్‌క్రాస్ పురస్కారం అందుకున్న కేవీఆర్ బాబు

కావలి : ఆర్టీసీ రోడ్డు భద్రతా పక్షోత్సవాల సందర్భంగా అత్యధిక మందితో రక్తదానం చేయించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన కావలి డిపోకు ఉత్తమ రక్తదాన మోటివేటర్ పురస్కారం లభించింది. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని రెడ్‌క్రాస్‌లో రక్తదాన మోటివేటర్లకు గురువారం పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కావలి డిపోకు పురస్కారాన్ని అందజేశారు. రక్తదాన శిబిరం విజయవంతానికి కృషి చేసిన నాటి కావలి డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కేవీఆర్ బాబు పురస్కారాన్ని స్వీకరించారు. ఆయన్ని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు, వివిధ ఉద్యోగ సంఘ నాయకులు అభినందించారు. సూపరింటెండెంట్ (ట్రాఫిక్) రామకృష్ణ, బస్ స్టేషన్ సూపర్‌వైజర్ రమేష్‌బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు టీ రఘునాథరెడ్డి, చెంచురామయ్య, కేవీ రమణయ్య, వెంకటేశ్వర్లు, నారపరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

**సేవియర్స్‌కు పురస్కారం**

పట్టణానికి చెందిన సేవియర్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా రెడ్‌క్రాస్ నుంచి పురస్కారం అందుకుంది. ఏడాది కాలంలో అత్యధిక మందితో రక్తదానం చేయించి జిల్లా స్థాయిలో రెండో స్థానం, కావలి పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో సేవియర్స్ నిలిచింది. ఇందుకుగానూ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర సభ్యుల చేతుల మీదుగా సేవియర్స్ ప్రతినిధులకు గురువారం పురస్కారాన్ని ప్రదానం చేశారు.

సోమశిల: సోమశిల మాజీ ఉపసర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాసులు కుమారుడు జగదీష్ ఉత్తమ రక్తదాన మోటివేటర్ పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని రెడ్‌క్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం కోటారెడ్డి, తదితరులు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు.



పురస్కారం అందుకున్న సేవియర్స్ ప్రతినిధులు

# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. విశేషాలంకారాల్లో అమ్మవార్లు కొలువై భక్తులను అనుగ్రహించారు.**

ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరి, జ్వాలాముఖి ఆలయంలో స్వర్ణకవచాలంకృత, కన్యకాపరమేశ్వరి ఆలయంలో భువనేశ్వరిగా, తిరునాళ్లతిప్పపై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం బాలాత్రిపురసుందరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సీతారామపురం: మండలంలోని ఘటిక సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరిదేవి అమ్మవారు సిద్దేశ్వరిగా, నారాయణప్పపేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో గౌరీదేవి, సీతారామపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో వాసవీ అలంకారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతిపరమేశ్వరి ఆలయం, సంతానలక్ష్మీదేవి ఆలయాల్లో అమ్మవార్లు బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో శైలపుత్రి, వరికుంటపాడులోని నాగరప్పమ్మ ఆలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని సోమేశ్వరాలయంలో కామాక్షితాయి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాల్లో ఉదయం శరన్నవరాత్రి ఉత్సవాలకు కలశ స్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షితాయి అమ్మవారు కామాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది.



ఆత్మకూరు: భువనేశ్వరిగా కన్యకాపరమేశ్వరి



ఆత్మకూరు: స్వర్ణ కవచాలంకృత జ్వాలాముఖి



సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షిదేవి అలంకారం



కలిగిరి: తెల్లపాడులో బాలాత్రిపురసుందరి అలంకారం



వరికుంటపాడు: శైలాపుత్రిగా మానసాదేవి



సీతారామపురంలో వాసవీ అలంకారం

### అల్లూరులో ఓ మోస్తరు వర్షం

అల్లూరు: అల్లూరులో గురువారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమైంది. రాత్రికి ఉరుము లు, మెరుపులతో వర్షం పడింది. వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిల్వ చేరడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

### ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఉదయగిరి ఎక్సైజ్ సీఐగా తన్నీరు లక్ష్మణ్‌స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన ఎక్సైజ్ విధానం ప్రకారం ఈ నెల 10వ తేదీ వరకు మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈ నెల 11న లాటరీ విధానంలో దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు. కాగా నూతన సీఐను ఎక్సైజ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.